క్లుప్తంగా

మృతురాలుకు మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట పట్టణ పరిధి 13వ వార్డు భాషానాయక్ తండాలోని బీఆర్ఎస్ నాయకులు బాణోతు కేశవ్, జాని మాతృమూర్తి బాణోతు లక్ష్మి మంగళవారం మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, 28వ వార్డు కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే.రఫీ, కక్కిరేణి నాగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు

పెన్‌పహాడ్ : తంగెళ్లగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వర, సురమాంబ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలోని పురవీధుల గుండా విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామదేవతలకు పూజలు జరిపారు. నేడు విగ్రహాల ప్రతిష్ఠతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం నిర్మాణానికి కోమటిరెడ్డి విరాళం

మద్దిరాల : చిన్ననెమిల ఆవాసం గుట్టకాడి తండాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశివుడు సురేష్ దేవాలయ నిర్మాణానికి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.4లక్షల విరాళం ప్రకటించారు. మంగళవారం తండావాసులు ఆయనను హైదరాబాద్‌లో కలువగా ధ్వజస్తంభం నిర్మాణానికి విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ బూబా లింగనాయక్, దేవాలయ చైర్మన్ రమేష్, శైలజ, గుగులోతు మదారు, వీరన్న, అనిల్, నరేష్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ఆత్మకూర్(ఎస్) : క్షేత్రస్థాయిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతుంది. ఖాశీగూడెం గ్రామానికి చెందిన మైబెల్లి తన వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ విషయమై అధికారులు డీడీ కడితే కొత్తగా స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో సదరు రైతు దాదాపుగా ఆరు నెలల క్రితమే డీడీ చెల్లించాడు. కానీ ఇప్పటివరకు విద్యుత్ సిబ్బంది నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయలేదు. చేసేదేమీ లేక రైతు అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఆరు నెలలుగా విద్యుత్‌సిబ్బందిని అడుగుతున్నా వారు పట్టించుకోవడంలేదని రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని చాలామంది రైతులు విద్యుత్ సిబ్బంది తీరుతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుకుంటున్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోదాడఅర్బన్ : కోదాడ తపాలా కార్యాలయంలో పునఃప్రారంభించిన ఆధార్ నమోదు కేంద్రాన్ని స్థానిక, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కోరారు. మంగళవారం స్థానిక ఉప తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ పోస్టుమాస్టర్ జి.రవి, తపాలా సిబ్బంది జి.లలిత, డి.శ్యాంసన్, మతీన్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా..

కోదాడరూరల్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలైన, మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. ఇటీవల మండల పరిధిలోని తొగర్రాయిలో తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన వట్టికూటి శ్రీనివాస్ కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి, కార్పొరేషన్ నుంచి తక్షణ సహాయం కింద మంజూరైన రూ.25 వేల చెక్కును అందజేశారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కేఎల్ఎన్ ప్రసాద్ ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్

క్రీడాప్రాంగణం.. బోర్డులకే పరిమితం!

- పెన్‌పహాడ్ మండలంలో అందుబాటులోకి రాని క్రీడా ప్రాంగణాలు
- స్థలాలు సేకరించారు.. బోర్డులు ఏర్పాటు చేశారు
- ఇప్పటివరకు కేవలం రెండు గ్రామాల్లోనే నిర్మాణాలు పూర్తి



చీదెళ్లలో క్రీడా ప్రాంగణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ వాటిని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. పెన్‌పహాడ్ మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో వసతులతో కూడిన మైదానాలను అందుబాటులోకి తీసుకురాలేదు. మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలకు కలిపి మొత్తం 43 క్రీడామైదానాలకు స్థలాలను సేకరించారు. కానీ మాచారం, లింగాల గ్రామాల్లో మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మిగతా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదు.

కనబడని క్రీడా సామగ్రి..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు రూ. 4లక్షల వరకు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్‌బాల్, ఖోఖో, ఖబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలి. మైదానం చుట్టూ మొక్కలు నాటాలి. కానీ క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాలు పరిశీలిస్తే ఎలాంటి సౌకర్యాలు కానరావడం లేదు. కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు చెట్ల పొదలు, గుట్టలు, బండలతో దర్శనమిస్తున్నాయి. క్రీడా ప్రాంగణాల ఏర్పాట్ల వసతులపై దృష్టి సారించాలని గ్రామాల్లో క్రీడాకారులు కోరుతున్నారు.

యువత క్రీడలకు దూరం..

గ్రామాల్లో ఆట స్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంగా మారుతోంది. స్థలాల కొరత పేరుతో గ్రామాలకు దూరంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా వేసవిలో క్రీడాకారులు పంట చేళ్లను, ఖాళీ ప్రదేశాలను మైదానాలుగా మార్చుకొని ఆడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడా మైదానాలపై దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

స్వాగత బోర్డులకే పరిమితం..

ప్రభుత్వం పకడ్బందీ నిబంధనలతో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని చెప్పింది. కానీ పనులన్నీ హడావుడిగా ఇష్టారీతిన చేపట్టి చేతులు దులుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో స్థలాల సమస్య ఉండటంతో పాఠశాల మైదానాలు, ఇరుకైనా స్థలాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. వాలీబాల్ కోర్టు కోసం రెండు వైపులా స్తంభాలు, స్వాగత తోరణం, వ్యాయామ బార్లు పాతుతున్నారు. ఎక్కడ చూసినా అవే కనిపిస్తున్నాయి. లాంగ్‌జంప్ పిట్లు, ఖోఖో కోర్టులను చదును చేసిన మైదానాలు ఎక్కడా కనిపించడం లేదు.

క్రీడా ప్రాంగణాల పనులు పూర్తి చేస్తాం



మండలంలోని లింగాల, మాచారం గ్రామాల్లో మాత్ర మే క్రీడా ప్రాంగణాలు పూర్తయయ్యాయి. మిగతా గ్రామాల్లో స్థలాలు కేటా యించాం. పనులు త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేస్తాం.

– బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు, తదితరులు

సూర్యాపేట రూరల్ : మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు పిల్లలమర్రిలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల చిత్రపటాలకు వికలాంగుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. వికలాంగులకు రూ. 3116ల నుంచి రూ. 4116లకు పింఛన్ పెంచడం హర్షణీయమన్నారు. బడుగు జీవులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉందన్నారు. గతంలో చాలీచాలని పింఛన్‌తో వికలాంగులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి వికలాంగులకు స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు బంగారి శ్రీనివాస్, నాయకులు రాపర్తి సైదులు, సోమగాని లింగస్వామి, చెరుకుపల్లి వెంకట్‌లాల్, రాపర్తి మహేష్‌కుమార్, తూటిపల్లి సత్తయ్య, వికలాంగులు దేవరశెట్టి వెంకన్న, కుమ్మరికుంట్ల జానకిరాములు, తూటిపల్లి సైదులు, లోడే నరేష్, జెర్రిపోతుల వెంకన్న, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమయ్యేనా..

- మద్దిరాల మండలంలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- పంపిణీ చేయడంలో ఏళ్ల తరబడి జాప్యం
- పది రోజుల్లో పంపిణీకి ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆశావహుల్లో ఉత్సాహం



మద్దిరాలలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

మద్దిరాల : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. కానీ వాటి నిర్మాణాలు పూర్తయినా పంపిణీకి మాత్రం నోచుకోవడంలేదు. పూరిగుడిసెల్లో ఉంటున్న దరఖాస్తుదారులు ఇళ్ల పంపిణీ ఎప్పుడు చేపడతారో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో జరిగిన నియోజకవర్గస్థాయి దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ 10రోజుల్లో ఇళ్లను పంపిణీ చేస్తామని దరఖాస్తుదారులకు హామీ ఇచ్చారు. దీంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2015 సంత్సరం నవంబర్‌లో మద్దిరాల మండల కేంద్రంలో మొత్తం 75 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఒక్కో ఇంటికి రూ.5.4లక్ష చొప్పున మొత్తం 75 ఇళ్లకు రూ.3.78 కోట్లను కేటాయించారు. దాదాపు 8 సంవత్సరాలు నిర్మాణ పనులు కొనసాగించారు. చివరకు నిర్మాణాలు పూర్తయినా ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 9న మండల కేంద్రంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 10రోజుల్లో ఇళ్ల పంపిణీ చేస్తామని ఆయన ప్రకటించారు. దీంతో ఇప్పటికైనా తమ కల సాకారమవుతుందని ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అపోహలకు తావులేదు



డబుల్ ఇళ్ల పంపిణీ విషయంలో అపోహలకు ఎలాంటి తావు లేదు. అర్హుల ఎంపిక పార్టీలకు అతీతంగా ఉంటుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయడం జరుగుతుంది.

– ఎస్‌ఏ.రజాక్, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్

జిల్లా అధికారులకు జాబితా అందజేశాం



దరఖాస్తుదారుల ఇళ్లలోకి వెళ్లి సర్వే నిర్వహించాం. లబ్ధిదారుల జాబితాను తయారు చేసి జిల్లా అధికారులకు అందజేశాం. ప్రభుత్వ జీఓ ప్రకారం అర్హులను గుర్తించడం జరిగింది.

– అమీన్‌సింగ్, తహసీల్దార్

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు దోపిడీని అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థల్ని సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు పుల్లూరి సింహాద్రి కోరారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను పాటించడంలేదని అన్నారు. చాలా విద్యాసంస్థల్లో అడ్మిషన్ రుసుము పేరుతో తల్లిదండ్రుల దగ్గర ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై డీఈఓకు ఫిర్యాదు చేస్తే స్పందన కరువైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, సునీల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య దినోత్సవం

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తిలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు నిర్వహించే ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

19 న్యూట్రీషన్ కిట్లు మంజూరు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి గర్భిణులకు 19 న్యూట్రీషన్ కిట్లు మంజూరయ్యాయి. గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి ఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి మణిదీప్ తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా న్యూట్రీషన్ కిట్లను ఇవ్వనున్నట్లు చెప్పారు.

ధాన్యం డబ్బులు అందక రైతుల ఇబ్బందులు



మాట్లాడుతున్న కోట గోపి

మద్దిరాల : కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యం డబ్బులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. మంగళవారం జి.కొత్తపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ధాన్యం అమ్మి నెలరోజులు గడుస్తున్నా ఇంతవరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, రామూర్తి, వెంపటి మల్లయ్య, ఏసు, సుధాకర్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : రైతుల ఖాతాల్లో ప్రభుత్వం వెంటనే ధాన్యం నగదు జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కమ్మంపాటి రాము డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు నగదు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మంపాటి అంతయ్య, రేగట్టె లింగయ్య, పాదిల లింగయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి : జూన్ 15న ఖమ్మంలో నిర్వహించనున్న మా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన ఖమ్మం సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ 9ఏళ్ల సంక్షేమ అభివృద్ధి పాలనపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి పార్లమెంట్ సెక్టార్ వారీగా ప్రవస్ యోజన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించడమే కాకుండా పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కాని మన్మథ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, చల్లమల్ల నరసింహ, జిల్లా అధికార ప్రతినిధి అయితగాని జానయ్య గౌడ్, జిల్లా నాయకులు పోలగాని ధనుంజయ్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, వెన్న శశిధర్ రెడ్డి, పోకల రాములు, పేర్వాల లక్ష్మణరావు, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం సభను జయప్రదం చేయాలి

తిరుమలగిరి : ఈ నెల 15వ తేదీన ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని సభ పర్యవేక్షణ ఇన్‌చార్జ్ కొత్త అశోక్ కోరారు. మంగళవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 12 వేల మందిని సమీకరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడెం రామచంద్రయ్య, పేరాల పూలమ్మ, సాయిబాబా, దీన్‌దయాళ్, హనుమంతు, బంగారురాజు, సాగర్, వెంకన్న, శంకర్, చిరంజీవి పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు



ఆత్మకూర్(ఎస్) : ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ



అర్వపల్లి ఎమ్మార్సీలో..

ఆత్మకూర్ (ఎస్) : పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరుతున్నాయి. ఇప్పటికే మండల కేంద్రంలోని ఎంఆర్‌సీకి చేరగా మంగళవారం ఎంఆర్‌సీ నుంచి మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్తున్నారు. కాగా 80 శాతం పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరినట్లు ఎంఈఓ పి.ధారాసింగ్ తెలిపారు.

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అర్వపల్లిలోని ఎమ్మార్సీలో మంగళవారం పంపిణీ చేశారు. మండలానికి ఈసారి మొదటి విడతగా 10,472 పాఠ్యపుస్తకాలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఎస్ హెచ్‌ఎం ఎం.యాకలక్ష్మి, ఉపాధ్యాయులు వైవీ రావు, బాలాజీ, రేణుక, ఐఈఆర్‌టీ బి.రమేష్, మెసెంజర్ బింగి ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర కరపత్రం ఆవిష్కరణ

కోదాడరూరల్ : రాష్ట్రంలో ఇళ్లు, ఇంటి స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వెలిది పద్మావతి కోరారు. మంగళవారం మండలంలోని కాపుగల్లులో బస్సుయాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న అర్హులైన వారందరికీ 125 గజాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ నెల 18న కాపుగల్లుకు బస్సుయాత్ర చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గుడిసెవాసులు, గ్రామస్తులు ఉన్నారు.

మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



తిరుమలగిరిలో ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, ఎమ్మెల్యే కిశోర్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం తిరుమలగిరిలో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదింటి ఆడ బిడ్డల పెళ్లి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఏ రాష్ట్రంలో లేదని గుర్తు చేశారు. నియోజకవర్గంలో మహిళలకు 8745 కేసీఆర్ కిట్లు అందినట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, అన్ని వర్గాల ప్రజల కోసం కృషి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ, బోనాలతో మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్ రావు, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతి, మున్సిపల్ చైర్ పర్సన్ పోతరాజు రజని, ఎంపీపీ స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, డీఆర్‌డీఏపీడీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



నాగారం : చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నాగారం : పేరబోయినగూడెం ఆవాసం కంచుగట్ల గూడేనికి చెందిన పాక రమేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడు బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వం పొంది ఉండటంతో అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2,00,000 ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ తిరుమలగిరిలోని తన నివాసంలో మంగళవారం మృతుడి భార్య పాక రజితకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, తీగుళ్ల ప్రశాంత్, కడారి సత్తయ్య, దొడ్డి ప్రేమయ్య, రాంమూర్తి, వేర్పుల సుకుమార్, యాదగిరి పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా అధికారిగా శ్రావణి

నూతనకల్లు : మండల ఉత్తమ మహిళా ఉద్యోగిగా తాళ్లసింగారం సెక్టార్‌లో పనిచేస్తున్న ఏఈఓ శ్రావణి ఎంపికైన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో మహిళా సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును, ప్రశంసపత్రాన్ని అందుకున్నారు.

ఆలయాలకు పూర్వవైభవం

మునగాల : తెలంగాణ రాష్ట్రంలో ఆలయాలకు పూర్వవైభవం వస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో కలకోవ గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని, సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల్లో దూపదీప, నైవేద్య అర్చకులకు ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.ఆరు వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకుంటుందన్నారు. దీనిలో రూ.2 వేలు నిత్య పూజల కోసం, రూ.4 వేలు అర్చకుల కోసం కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవాని, ఉపసర్పంచ్ బెల్లంకొండ చిన వెంకన్న, మండల నాయకులు నల్లపాటి శ్రీనివాసరావు, కందిబండ సత్యనారాయణ, ఎలక నరేందర్‌రెడ్డి, సీతారాములు, కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ గుర్వయ్య, వీరయ్య, విజయలక్ష్మి, పాలకవర్గం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలకోవలో దేవాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



బొల్లంపల్లిలో విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు



కొమ్మాల శివాలయంలో హోమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రా మంలో నూతనంగా నిర్మించిన పార్వతీసోమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యా యి. తొలిరోజు గణపతి పూజ, ధ్వజమునకు, శిఖరమునకు జలాధివాసం, హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, సర్పంచ్ గంగదెరి వెంకటమ్మ, ఉపసర్పంచ్ కుంట్ల రేణుక, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బొల్లంపల్లిలో..

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన విశాలక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజస్తంభం, విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి దేవత మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు ఆలయంలో 2000మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దానం సుజాతయాదగిరి, ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి సింధూరాభిషేకం



ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, సింధూరాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ జరిపారు. అనంతరం మహార్నివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజయ్య, తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు, దాతలు ఓరుగంటి భానుప్రకాష్, మౌనిక, కొత్తూరు పూర్ణచందర్‌రావు, రాధ, గెల్లా సాయి, లక్ష్మీనారాయణ, కృష్ణకుమారి, వీరేపల్లి రామారావు పాల్గొన్నారు.